అన్నదాత.. గుండె కోత




నూజివీడు పట్టణంలోని ఊటవాగు పక్కన ఇసుక మేట వేసిన వరి పొలం; నూజివీడు పెద్దచెరువు ఆయకట్టులో సాగుచేసిన వరి పొలంలో మేట వేసిన కంకర

- మేట వేసిన పంట పొలాలు
- 4,200 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఆదుకోవాలని రైతుల వినతి

నూజివీడు: భారీ వర్షాలకు వాగులు పొంగి, నూజివీడు పెద్ద చెరువుకు గండి పడటంతో ముంచెత్తిన వరదకు పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. కొంతమేర కొట్టుకుపోయాయి. రైతులు నియోజకవర్గ వ్యాప్తంగా వరి, మినుము, పత్తి పంటలతో పాటు నూజివీడు మండలంలోని జంగంగూడెం, దేవరగుంటలలో కూరగాయల పంటలు వేశారు. వీటిలో కూర అరటి, పొట్ల, సొర, వంగ, బెండ, చిక్కుడు, కాకర తదితర పంటలను రైతులు సాగు చేశారు. వరద ఉధృతికి, ఇసుక మేటలు వేసి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఊటవాగు, రామిలేరు వాగుల వెంబడి ఉన్న పొలాలన్నీ నీట మునిగి కొట్టుకుపోయాయి.

25 వేల ఎకరాల్లో పంటల సాగు

నూజివీడు నియోజకవర్గంలో రైతులు దాదాపు 25 వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. వీటిలో వరి, మినుము, పత్తి, కూరగాయ పంటలు ఉన్నాయి. నూజివీడు, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లోని చెరువులు తెగడం వలన వాగులు ఉప్పొంగి వరి, మినుము, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలకు సంబంధించి సుమారు 200 ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నూజివీడు మండలం మీర్జాపురం, గొల్లపల్లి, పోలసానపల్లి తదితర గ్రామాల్లో మినుము పంట ముంపునకు గురై పాచిపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు అతి వృష్టికి దెబ్బతినడంతో నష్టాల బారిన పడ్డామని రైతులు తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం తమను వెంటనే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మండలం	వరి	పత్తి	మినుము	వేరుశనగ	చెరకు	మొక్కజొన్న
చాట్రాయి	600	50	50	--	--	--
ముసునూరు	415	25	50	15	--	--
నూజివీడు	1,320	133	843	4	16	2
ఆగిరిపల్లి	350	50	280	--	--	--
మొత్తం	2,685	258	1,223	19	16	2

సర్వం కోల్పోయి.. రోడ్డునపడి

- ముంచేసిన పులివాగు
- కళ్లముందే కొట్టుకుపోయిన ఇళ్లు, పశుసంపద
- సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు



చెర్వుమాధవరం గ్రామంలో ఇళ్లు కోల్పోయి సాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు

జి.కొండూరు: భారీ వర్షాలు ముంపులో గూడు, కూడు, గుడ్డ అన్నీ కోల్పోయి రోడ్డున పడ్డ ఆ కుటుంబాల బాధ వర్ణనాతీతం. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కూలో నాలో చేసుకొని రూపాయి, రూపాయి కూడబెట్టి కట్టుకున్న ఇళ్లు కళ్ల ముందే గంగలో కలిసిపోయాయి. జి.కొండూరు మండల పరిధిలోని చెర్వుమాధవరం గ్రామంలో పులివాగును ఆనుకొని ఉన్న లావుడియా నాగేశ్వరరావు, బాణావతు సోనా, బూక్యా చందుకి చెందిన మూడు ఇళ్లు వరద ఉధృతిలో కొట్టుకుపోగా బూక్యా లాలూ, బూక్యా జోమహర్‌కి చెందిన రెండు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. బాణావతు మారుకి చెందిన చర్చి వరదల్లో కొట్టుకుపోయింది. గంగినేని గ్రామంలో నన్నెబోయిన వెంకటేశ్వరరావు, బూక్యా శంకర్, గుండిపాక శ్రీకాంత్, దొమ్మనబోయిన వెంకమ్మకు చెందిన ఇళ్లు పూర్తిగా వరదకు కొట్టుకుపోగా సాగర్ల ముత్యాలుకు చెందిన 20 మేకలు వరదలో కొట్టుకుపోయాయి. జింకల బుల్లియ్యకు చెందిన పాడి గేదె వరదలో కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన 20 మంది ఇళ్లు ధ్వంసమయ్యాయి. వీరంతా ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అంతే కాకుండా మైలవరం, రెడ్డిగూడెం మండలాల పరిధిలో పలు చోట్ల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

కొట్టుకుపోయిన వంతెనలు

మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధిలో మునగపాడు, గడ్డమణుగు మధ్య పులివాగుపై ఉన్న వంతెన, గుర్రాజుపాలెం వెళ్లే దారిలో చప్టా, చెర్వుమాధవరం వద్ద పులివాగుపై ఉన్న వంతెన, చప్టా, ఆత్కూరు, ముత్యాలంపాడు నడుమ ఉన్న చప్టా, కొండపల్లి శాంతినగర్, జి.కొండూరు మండల పరిధి కవులూరు గ్రామాల మధ్య పోలవరం కాల్వపై ఉన్న వంతెనలు వరద ప్రవాహంలో కొంత మేర ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. గంగినేని, చిన్ననందిగామ, వెల్లటూరు, బీమవరప్పాడు, సీతారాంపురం, కోడూరు, ఆత్కూరు, హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు, వెలగలేరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు వరద ప్రవాహానికి కోతకు గురై గండ్లు పడ్డాయి. మైలవరం మండల పరిధి చంద్రాల, గణపవరం, జంగాలపల్లి, చంద్రగూడెం, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులకు గండ్లు పడడంతో పాటు పలు చోట్ల రహదారులు ధ్వంసమై పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

పనిచేస్తేనే పూట గడిచేది



నేను, నా కోడలు లక్ష్మి ఇద్దరం పులివాగు పక్కన ఇల్లు కట్టుకొని ఉంటున్నాం. ఒక్కసారిగా వచ్చిన వరదతో ఇల్లు కొట్టుకుపోయి అన్నీ కోల్పోయాం. మా ఇద్దరికీ భర్తలు లేరు. నా కోడలు పని చేస్తేనే మాకు పూట గడిచేది. ప్రభుత్వం వెంటనే స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి. – బాణావతు సోనా, చెర్వుమాధవరం, జి.కొండూరు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



పులివాగు పక్కనే ఉన్న మా ఇల్లు వరదలో కొట్టుకుపోయింది. కట్టుబట్టలతో బయటకి వచ్చాం. ఇంతవరకు మమ్మల్ని మందలించినవాళ్లు లేరు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి. ఆర్థిక సాయం అందించాలి. –బూక్యా లక్ష్మి, చెర్వుమాధవరం, జి.కొండూరు మండలం

కళ్ల ముందే కొట్టుకుపోయింది



అందరం చూస్తుండగానే వరదలో మా ఇల్లు కొట్టుకుపోయింది. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదు. నరకయాన అనుభవిస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి. ఆర్థికంగా ఆదుకోవాలి. – లావుడియా నాగేశ్వరరావు, చెర్వుమాధవరం, జి.కొండూరు మండలం

174 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం



కూరగాయల తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ ఆర్.హేమ

నూజివీడు: భారీ వర్షాలకు మండలంలోని దేవరగుంట, జంగంగూడెం, సుంకొల్లు, బత్తులవారిగూడెంలలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన అధికారి ఆర్. హేమ అన్నారు. ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. అధిక వర్షాలకు 174.28 ఎకరాల ఉద్యాన పంటలు నీట మునగడంతో 122 మంది రైతులు నష్టపోయారని చెప్పారు. నీట మునిగిన, ఉద్యాన పంటలలో రైతులు పాటించవలసిన చర్యలను ఆమె సూచించారు.

అరటి: అరటి నీట మునిగితే నీటిని బయటకు పంపి 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్ ఒక్కో మొక్కకు వేసుకోవాలి. సిగటోక తెగులు నివారణకు ప్రొఫికోనజోల్ ఒక మిల్లీలీటరు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బొప్పాయి: పొలంలోని నీటిని బయటకు పంపాలి. క్రాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్ల మొదలు తడిచేలా పిచికారీ చేయాలి.

కూరగాయ పంటలు: పొలంలోని నీటిని బయటకు తీసివేయాలి. కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి డ్రెన్సింగ్ చేయడంతో పాటు మొక్కలపై పిచికారీ చేయాలి. 19 19 19 లేదా 13 00 45 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మామిడి: మామిడి మొక్క తోటలకు, పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బోరాక్స్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

తాగునీరు లేక విలవిల



పగిలిపోయిన కృష్ణా వాటర్ పైపులు

జి.కొండూరు: వరద ఉధృతికి కృష్ణా వాటర్ పైపులైను పగిలిపోవడంతో గత మూడు రోజులుగా మైలవరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వరద ప్రభావానికి ముందు రోజు అంటే గత నెల 30వ తేదీన సరఫరా అయిన నీటినే పొదుపుగా వాడుకుంటూ వచ్చిన ప్రజలు ఆ నీరు కూడా అయిపోవడంతో నరకయాతన పడుతున్నారు. ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్‌ల వద్దకు వెళ్లి తాగునీరు కొనుక్కుంటున్నారు. ఆ అవకాశం కూడా లేని చోట తాగు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధి కవులూరు, ఆత్కూరు, హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు, వెల్లటూరు, వెలగలేరు, దుగ్గిరాలపాడు, గంగినేని, విజయవాడ రూరల్ మండల పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, మైలవరం మండల పరిధిలోని ఎస్ఆర్ తండా, రుద్రవరం, రెడ్డిగూడెం మండల పరిధిలోని పలు గ్రామాలకు కృష్ణా వాటర్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే పైపులైన్ల మరమ్మతులు చేపట్టి వాటర్ సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

ముసునూరు: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నేత జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ముసునూరు, చింతలవల్లి, వలసపల్లి గ్రామాల్లో నీట మునిగిన వరి, పత్తి పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు.

ఆశా వర్కర్ల నిరసన

నూజివీడు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నూజివీడు కోనేరుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు మంగళవారం నిరసన తెలిపారు. సీఐటీయూ నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కమల, నాగమణి, స్వాతి, కుమారి, స్రవంతి, విజయ్‌కుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు

చాట్రాయి: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు భారీగా వరద చేరింది. చిన్నంపేట వాగు వంతెన వద్ద కాజ్‌వే కొట్టుకు పోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

సూరంపాలెంలో వైద్య శిబిరం

చాట్రాయి: చనుబండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

ముసునూరు: వినాయక చవితి ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మణ్‌బాబు అన్నారు. మంగళవారం ఏఎస్ఐ నాగఫణి భూషణరావుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. అనుమతి కోరే వారు ముందుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంబంధిత యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవరాత్రి మండపాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎల్ఐసీ వార్షికోత్సవం

తిరువూరు: భారతీయ జీవిత బీమా సంస్థ వార్షికోత్సవం స్థానిక శాటిలైట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సంస్థ తిరువూరు శాఖ మేనేజర్ ఎం. రమేష్ కేక్ కట్ చేసి పంపిణీ చేసి మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎల్ఐసీ ఏజెంట్లకు, పాలసీదారులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్యలోపంతో ప్రబలుతున్న వ్యాధులు

తిరువూరు: భారీ వర్షాలకు తోడు తిరువూరు పట్టణంలో పారిశుద్ధ్య సమస్యతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. నివాస గృహాల నడుమ ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నిలిచిపోయిన మురుగునీరు, వర్షంనీటిలో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో జ్వరాలు వ్యాపిస్తాయని పలు వార్డుల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని శాంతినగర్, పాత తిరువూరు, మధిరరోడ్డు, పొలిమేర డొంక, సుందరయ్య కాలనీ, భగత్‌సింగ్ నగర్ కాలనీ, రాజుపేట ఒకటో వార్డు, తోకపల్లి, తంగిళ్ల బీడు ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వర్షం నీటితో కలిసి మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పలు వార్డుల్లో వారానికి ఒక రోజు కూడా వీధులు శుభ్రపరచకపోవడం, మురుగు కాలువల్లో పూడికతీసి బ్లీచింగ్ పిచికారీ చేయకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని వార్డు వాసులు వాపోతున్నారు. నగర పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా వార్డుల్లో ప్రతి రోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించడం సాధ్యపడట్లేదని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి రైతుల ఇక్కట్లు

తిరువూరు: తుపాను కారణంగా వర్షం నీటిలో మునిగిన పంటలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతుసంఘ మండల కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం తిరువూరు మండలంలో వరద ముంపునకు గురైన పంటలను రైతు సంఘం నాయకులు సందర్శించారు. రాజుపేటలోని తంబళ్లవారి కుంట చెరువు ఆయకట్టులో వరిపంటను పరిశీలించిన అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖరీఫ్ వరి, పత్తి పైర్లు పూర్తిగా నీట మునిగాయని, వ్యవసాయాధికారులు త్వరిత గతిన నష్టం అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుసంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు వేముల హరికృష్ణ, బండి వెంకటేశ్వరరావు, గోదా వెంకటేశ్వరరావు, పామర్తి ఆంజనేయులు, బెజవాడ సత్యనారాయణ, ధనేకుల మల్లేశ్వరరావు, బండి కృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు ఆదుకోవాలి

నూజివీడు: పట్టణంలోని పెద్ద చెరువుకు గండి పడి ముంపునకు గురైన ప్రాంతాల్లో మంగళవారం సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, నాయకులు బండి వెంకటేశ్వరరావు, కొమ్మన నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, కూచిపూడి నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు బృందం పర్యటించి బాధితులతో మాట్లాడారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు.

లయన్స్ క్లబ్ సాయం

తిరువూరు: తుపాను కారణంగా తిరువూరు పట్టణంలో నిరాశ్రయులైన కుటుంబాలకు మంగళవారం లయన్స్ క్లబ్ సభ్యులు సహాయం అందజేశారు. భగత్‌సింగ్ నగర్ కాలనీలో నీట మునిగిన ఇళ్లల్లో ఇబ్బంది పడుతున్న మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

మైలవరం: వరదలకు ఇల్లు కోల్పోయి, ఇబ్బందిలో ఉన్న కుందుర్తి హైమావతికి నిత్యావసర వస్తువులు, వస్త్రాలను మైలవరంలోని ఎస్ఎస్ బ్యాడ్మింటన్ ఏరీనా అధినేత, మైలవరం లయన్స్ క్లబ్ కార్యదర్శి చనమోలు నాగభూషణం మంగళవారం అందజేశారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

ముసునూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని చింతలవల్లి, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామ సచివాలయాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు.

తమ్మిలేరు వరద ఉధృతి పరిశీలన

బలివే(ముసునూరు): తమ్మిలేరు వంతెన వద్ద వరద ఉధృతిని ఈఓపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖాధికారులు మంగళవారం పరిశీలించారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: భారీ వర్షాలకు నూజివీడు పట్టణంలో దెబ్బతిన్న ప్రాంతాలను బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం స్థానిక ట్రిపుల్ ఐటీని సందర్శించారు.

వరద ఉధృతికి రహదారి ధ్వంసం



తిరువూరు: మండలంలోని టేకులపల్లి–గానుగపాడు గ్రామాల మధ్య వెదుళ్లవాగుకు వరద నీరు ఉధృతంగా రావడంతో ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. శ్రీనికేతన్–కొత్తపల్లి ఆర్ అండ్ బీ రహదారిపై రెండు గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. ధ్వంసమైన రహదారి కారణంగా పొలాలకు వెళ్లే రైతులు, గానుగపాడు, టేకులపల్లి గ్రామాల ప్రజలు చుట్టూతిరిగి వెళ్లవలసి వస్తోంది. మండలంలోని మల్లేల గ్రామ సమీపంలో ఆర్ అండ్ బీ రహదారిపై వరదలకు పడిన గండ్లను గ్రామస్తులు పూడ్చారు. జీ కొత్తూరు–చౌటపల్లి గ్రామాల మధ్య ధ్వంసమైన ఆర్ అండ్ బీ రహదారికి జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు తాత్కాలిక మరమ్మతులు చేశారు.

తగ్గుముఖం పట్టిన వరద

- ముంపులోనే పంట పొలాలు
- బయట పడుతున్న కార్లు, బైక్‌లు
- ఇళ్లు శుభ్రం చేసుకుంటున్న బాధితులు



మూలపాడు జెడ్పీ పాఠశాల తరగతి గదిలో వరద బాధితులు



పాత మూలపాడులో వరద నీటికి బురద పట్టిన ఇంటిని శుభ్రం చేసుకుంటున్న ఓ కుటుంబం

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి పోటెత్తిన వరద ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టింది. ఇబ్రహీంపట్నం మండలం పరిధి గ్రామాలు, ఫెర్రీలో తొలి రోజు సుమారు 12 అడుగుల ఎత్తుకు చేరిన వరదనీరు మంగళవారం మూడగుడుల మేర తగ్గింది. నీటి ముంపునకు గురైన కార్లు, బైకులు బయటపడ్డాయి. వీధుల్లో ఎటుచూసినా వరదనీరు ప్రవహిస్తోంది. సాయంత్రానికి మోకాలి లోతు నీళ్లల్లో నడుచుకుంటూ ఫెర్రీకి ప్రజలు చేరుకుంటున్నారు. మండల పరిధి గ్రామాల్లోని ఇళ్లల్లో వరదనీరు తగ్గినప్పటికీ పంట పొలాలు నీటిముంపులోనే ఉన్నాయి. వరద పట్టిన ఇళ్లను శుభ్రం చేసుకునే పనుల్లో బాధితులు నిమగ్నమయ్యారు. కొంతమంది ఇంకా జాతీయ రహదారిపైనే పడిగాపులు కాస్తున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి దాములూరు వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర పంట పొలాలు నీటి ముంపునకు గురికావడంతో రైతులు ఈ ఏడాది భారీగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వ సహాయం కోసం వారు ఎదురు చూస్తున్నారు.

సమస్యల వలయంగా సహాయ శిబిరాలు

వరద ముంపు బాధితులను తరలించిన సహాయక శిబిరాలు సమస్యల వలయంగా మారాయి. జెడ్పీ పాఠశాల, ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద అధ్వాన పారిశుద్ధ్యం మధ్య బాధితులను వదిలేశారు. ఇళ్ల నుంచి తీసుకువచ్చిన అధికారులు, సిబ్బంది కంటికి కనిపించడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

దాతల సాయంతోనే..

చిన్నపిల్లల తల్లుల అవస్థలు వర్ణనాతీతం. పసిపిల్లలతో వచ్చిన వారికి అధికారులు కనీసం పాలు కూడా ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు. కంచికచర్ల, ఖమ్మం జిల్లా జమలాపురం ప్రాంతాల నుంచి డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థలు ఆహారం తీసుకువచ్చి అందించారు తప్ప ప్రభుత్వం ద్వారా ఎటువంటి సహాయం అందలేదని ఆరోపిస్తున్నారు. ఎవరైనా దాతలు ఆహారం తీసుకువస్తే ఆకలితో ఆహారం ప్యాకెట్లు కోసం ఎగబడతున్నారు. ఒక్కోసారి తోపులాట జరుగుతోంది.

జ్వరాల బారిన బాధితులు

శిబిరాల్లో అనేకమంది జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధలు పడుతున్నారు. వైద్య శిబిరాల్లో సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీసం బీపీ చూసేందుకు మిషన్‌లో చార్జింగ్ లేదని చెబుతున్నారు. ఫెర్రీ, ఇసుక ప్రాంతం, ఆంజనేయ కాలనీ, చినలంక, పెదలంక గ్రామాల నుంచి సుమారు 600 గేదెలను శిబిరాల వద్దకు తరలించారు. మూడు రోజులుగా పశువులకు పశుగ్రాసం, దాణా, తాగేందుకు నీరు కూడా అందించలేదు. పాడిపశువులు ఆకలితో అల్లాడుతున్నాయి.

13 గేదెలు కొట్టుకు పోయాయి



వరద ఉధృతి పెరగడంతో మా ప్రాంతంలో ఉన్న రెండస్తుల భవనంపైకి వెళ్లాము. ఇంటిముందు కట్టేసిన 15 గేదెల్లో 13 గేదెలు వరద ప్రవాహంలో కొట్టుకు పోయాయి. రెండు గేదెలు కట్టేసిన చోటే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. – ఎస్.ప్రమీల, పెదలంక గ్రామం

పిల్లలకు పాలు ఇవ్వడం లేదు



మూడు రోజులుగా ట్రక్ టెర్మినల్ వద్ద సహాయక శిబిరంలో ఉంటున్నాం. ఇద్దరు చిన్న పిల్లలతో వచ్చాము. పిల్లలకు పాలు ఇవ్వడం లేదు. ఎవరో వచ్చి ఇచ్చే ఆహారం కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. అధికారులు పట్టించుకోవడంలేదు. – వల్లభనేని మల్లేశ్వరి, ఇబ్రహీంపట్నం

పొలాల్లో నీటిని బయటకు పంపాలి

రైతులకు శాస్త్రవేత్తల సూచన



ముంపునకు గురైన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

నూజివీడు: భారీ వర్షాలకు మండలంలో ముంపునకు గురైన వరి, మినుము, పత్తి పంటలను మంగళవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. నూజివీడులో వరి పొలాలను, మీర్జాపురం, మర్రిబంధాలలో మినుము పంటను, ముక్కొల్లుపాడు, రామన్నగూడేల్లో పత్తి పంటను శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ఫణికుమార్ మాట్లాడుతూ ముంపునకు గురైన వరి పొలాల్లో నీటిని బయటకు తీసేయాలన్నారు. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను చల్లుకోవాలన్నారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నప్పుడు ఆకు తెగులు వచ్చే అవకాశాలున్నాయి. దీని నివారణకు కాంటాఫ్ హైడ్రాక్లోరైడ్ మందును రెండు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మినుము పంట 15 నుంచి 40 రోజుల దశలో ఉందని, ఇది కూడా వరద ముంపునకు దెబ్బతిందన్నారు. ముంపునకు గురైన పొలానికి మల్టీకే 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పత్తి పంట 25 నుంచి 40 రోజుల దశలో ఉన్నందున ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ చల్లుకోవాలన్నారు. మొక్క బాగా తడిచేటట్లుగా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి, మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. సైంటిస్టు నాగేంద్రరావు, ఏడీఏ లలిత సుధ, నూజివీడు ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఓ ఆలూరు చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- **మైలవరం:** అధిక వర్షాలకు నీట మునిగిన వరి, పత్తి, అపరాలు పంట పొల్లాలో నీటిని వెంటనే తొలగించాలని మైలవరం మండల వ్యవసాయ శాఖాధికారి కె. సంధ్యారాణి అన్నారు. నీట మునిగిన పొలాలను ఆమె సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీఎస్ తోయజాక్షుడు, వీఏఏలు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్నదానం

కాచవరం(ఇబ్రహీంపట్నం): దాములూరు, చిలుకూరు వరద బాధితులకు ప్రముఖ వ్యాపారవేత్త బోడేపూడి అప్పారావు దంపతులు మంగళవారం అన్నదానం చేశారు. సర్పంచి దండుబోయిన రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో నిఫ్టీ ల్యాబ్స్ డైరెక్టర్ బి.కృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో కొటికలపూడి, గాజులపేట, మూలపాడు గ్రామాల్లో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** విజయవాడలోని వరద బాధితులకు నూజివీడులో తయారు చేసిన ఆహార ప్యాకెట్లను మంగళవారం విజయవాడకు పంపారు. వాహనాన్ని ఆర్డీఓ వై.భవానీశంకరి ప్రారంభించారు.
- **రాయనపాడు(విజయవాడరూరల్):** రాయనపాడులోని పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు సర్పంచి కాటంనేని కల్యాణి పూర్ణచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి పి.మురళీమోహనరావు, వీఆర్వో ఆర్.చంద్రశేఖర్‌శర్మ భోజనం ఏర్పాటు చేశారు.
- **తిరువూరు:** స్థానిక భగత్‌సింగ్ నగర్ కాలనీలో వరదముంపునకు గురైన నిరుపేద కుటుంబాలకు ఎస్‌బీఐ అధికారులు మంగళవారం దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. 22 కుటుంబాలకు బ్యాంకు తిరువూరు ఎస్‌బీఐ శాఖా మేనేజరు రవి కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ గోపీనాథ్, ప్రసాద్, ఆదిత్యలు వీటిని అందజేశారు.
- **ఆగిరిపల్లి:** విజయవాడ వరద బాధితులకు ఆగిరిపల్లిలోని పొన్నం కన్వెన్షన్ అధినేత పొన్నం వెంకట లక్ష్మణరావు, తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో 8 వేల వెజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లను పంపించారు. స్థానిక ముస్లింల ఆధ్వర్యంలో వరద బాధితులకు పులిహోర ప్యాకెట్లు పంపించారు.

ఆహార పొట్లాల పంపిణీ

మైలవరం: వర్షాలకు నిరాశ్రయులై పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్వీఎన్ నివృతరావు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం మంగళవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. లయన్ చారుగుండ్ల ప్రసాద్, లయన్ నాగభూషణం, కొల్లి పరప్రసాద్, కోడూరు మనోజ్‌కుమార్, చలువాది హరీష్‌కుమార్ పాల్గొన్నారు.